క్లుప్తంగా

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



అయప్పకు పూజలు చేయిస్తున్న రత్నాకర్

పుట్టపర్తి టౌన్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పిలుపునిచ్చారు. బుధవారం పుట్టపర్తిలోని పదో వార్డు గోకులంలో దుర్గమ్మ దేవాలయం ఎదురుగా నిర్మించిన అయ్యప్ప దేవాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం శ్రీ విఘ్న వినాయక సుబ్రమణ్యేశ్వర అయప్ప స్వాములు విగ్రహాల ప్రతిష్ఠలో పాల్గొన్నారు. మంగళవాయిద్యాల నడుమ వేదమంత్రోచ్చారణలతో పూర్ణకుంభంతో రత్నాకర్‌కు స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆలయాన్ని ప్రారంభించారు. అనంతనం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేయించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ముదిగుబ్బ: మలకవేమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం అర్ధరాత్రి డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాఫ్‌నర్స్ గంగాదేవితో ప్రసవాలు గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్ర నాయక్, ఎంపీహెచ్‌ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది మంజుల, అలివేలమ్మ, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.
ఫొటో:04డిఎంఎం602-రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు

ముదిగుబ్బ: చిత్రావతి నదీ పరివాహక ప్రాంతాలైన ఉప్పలపాడు, సీసీరేవు, పరిసర ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై బుధవారం ఆర్డీఓ మహేష్ తన సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. అనుమతులు లేని ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తున్న 9 టిప్పర్లు, 3 ట్రాక్టర్లను పట్టుకుని, జరిమానాలు విధించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మైనింగ్, ఇరిగేషన్, పోలీస్‌లు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ హబ్ ఏర్పాటు

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణ తెలిపారు. ఇందులో ఎంఐఎస్ (మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం) డేటా అనలిస్ట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కోర్సును ప్రారంభించినట్లు చెప్పారు. పది, ఇంటర్, డిగ్రీ, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 93901 76421 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సబ్సిడీ విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

తాడిమర్రి: ఖరీఫ్ పంటల సాగుకు సంబంధించి సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల కోసం రైతు సేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రమాదేవి రైతులకు సూచించారు. విత్తన వేరుశనగ 30 కిలోల బస్తా పూర్తి ధర రూ.2,790 కాగా 40 శాతం సబ్సిడీ పోగా రైతు రూ.1,674 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అర ఎకరా ఉన్న రైతుకు ఒక బస్తా (30 కిలోలు), ఎకరా వరకు రెండు బస్తాలు, ఎకరా మించి భూమి ఉన్న రైతులకు మూడు బస్తాలు ఇస్తారని తెలిపారు. సబ్సిడీ విత్తనం పొందిన రైతులు తప్పని సరిగా పంట సాగు చేయడంతో పాటు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు.

1,600 క్వింటాళ్ల వేరుశనగ కేటాయింపు

కనగానపల్లి: మండల కేంద్రం కనగానపల్లిలోని వ్యవసాయ గోదాములకు సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు బుధవారం చేరాయి. ఈ సందర్భంగా ఏఓ క్రిష్ణకుమారితో కలసి స్థానిక ప్రజాప్రతినిధులు విత్తన కాయలను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగుచేసే రైతులకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో విత్తన కాయలు అందజేస్తోందన్నారు. కనగానపల్లి మండలానికి 1,600 క్వింటాళ్లు కేటాయించగా, అందులో తొలివిడతగా 900 క్వింటాళ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. విత్తన కాయలు కావలసిన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

పదో రోజూ కొనసాగిన నిరసన



రోడ్డు పనులను అడ్డుకుంటున్న రైతులు

ముదిగుబ్బ: న్యాయమైన పరిహారం కోసం రైతులు పదో రోజు బుధవారం కూడా నిరసన కొనసాగించారు. ముదిగుబ్బ – పుట్టపర్తి మీదుగా చేపట్టిన జాతీయ రహదారి -342 పనులు జరగకుండా అడ్డుకున్నారు. తమకు న్యాయమైన పరిహారం ఇచ్చేవరకు పనులు చేపట్టరాదని భీష్మించారు. కార్యక్రమంలో రైతులు సోమల ప్రకాష్ నాయుడు, రాజేంద్రనాయుడు, హనుమంతు, సనత్‌కుమార్, ప్రభాకర్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో కేతిరెడ్డి ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పుట్టపర్తిలో దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల నిరసన ప్రదర్శన

వంచనపై తిరుగుబాటు

సూపర్ సిక్స్‌తో సహా అనేక హామీలు ఇచ్చి అమలు చేయకుండా కూటమి సర్కారు చేసిన వంచనపై ప్రజలు తిరగబడ్డారు. ప్రజా సంక్షేమం విస్మరించి రెడ్‌బుక్ రాజ్యాంగం మాటున సాగిస్తున్న అరాచకపాలనపై మండిపడ్డారు. పోలీసుల ఆంక్షలు... కూటమి నేతల కుట్రలను ఛేదించుకుని ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ చేపట్టిన ‘వెన్నుపోటు దినం’ కార్యక్రమానికి పార్టీ శ్రేణులతో కలిసి జనం ఉప్పెనలా తరలిరావడంతో సర్కారుకు నిరసన సెగ తాకింది.

- వెన్నుపోటు దినం విజయవంతం
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కదిలివచ్చిన జనం
- మోసం.. దగాతో సాగిన కూటమి ఏడాది పాలన
- వైఎస్సార్‌సీపీ నేతల మండిపాటు



కదిరిలో ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నమ్మించి.. వంచించడం బాబు నైజం



ధర్మవరం ఆర్డీఓ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ఎన్నికలకు ముందు ప్రజలను హామీలతో నమ్మించడం.. అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా మోసం చేయడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ధర్మవరం నియోజకవర్గ సమన్వయకర్త కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి విమర్శించారు. కూటమి సర్కారు ప్రజలకు చేసిన మోసాన్ని ఎండగడుతూ కేతిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ధర్మవరంలో ‘వెన్నుపోటు దినం’ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. తొలుత కేతిరెడ్డి క్యాంప్ కార్యాలయం నుంచి కాలేజ్ సర్కిల్, కళాజ్యోతి సర్కిల్, పీఆర్‌టీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా నిరసన తెలియజేశారు. కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 143 హామీలు, సూపర్ సిక్స్ వంటి ప్రధాన హామీలు గుప్పించిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు అధికారంలోకి వచ్చాక కనీసం ఒక్క హామీని కూడా అమలు చేయక పోవడం దారుణమన్నారు. సంక్షేమం అందక ప్రజలు దుర్భర పరిస్థితులు అనుభవిస్తున్నారన్నారు.

నరకం చూపిన కూటమి పాలన

ఎన్నికలకు ముందు కరెంట్ చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి రాగానే సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15 వేల కోట్ల భారం మోపి సామాన్యుల నడ్డి విరిచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని కేతిరెడ్డి విమర్శించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేసి అమాయకులను కేసుల్లో ఇరికించి నరకయాతనకు గురి చేసే విధంగా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. దేశంలోనే ఆదర్శవంత పాలన అందించిన సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసి.. ప్రజలను తిరిగి కష్టాలపాలు చేశారని ధ్వజమెత్తారు. దుర్మార్గపు పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజు దగ్గరలోనే ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మాసపల్లి సాయికుమార్, పట్టణాధ్యక్షులు బాలిరెడ్డి, నీలూరి ప్రకాష్, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చందమూరి నారాయణరెడ్డి, కౌన్సిలర్‌లు కేతాలోకేష్, చింతా యల్లయ్య, గజ్జల శివ, మేడాపురం వెంకటేష్, రమాదేవి, చింతా మారుతీ, బ్రహ్మ, రంగస్వామి, బత్తలపల్లి మండల కన్వీనర్ జయరామిరెడ్డి, తాడిమర్రి మండల కన్వీనర్ రామాంజినేయులు, ముదిగుబ్బ మండల కన్వీనర్ సీవీ నారాయణరెడ్డి, ధర్మవరం మండల కన్వీనర్ పోతుకుంట రామయ్య, వైస్ఎంపీపీలు ప్రతాప్‌రెడ్డి, వెంగళరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సరేష్, చిగిచెర్ల ప్రభాకర్‌రెడ్డి, అశ్వర్థ, భాస్కర్, మాజీ మండల కన్వీనర్‌లు ఇందుకూరు నారాయణరెడ్డి, బగ్గిరి బయపరెడ్డి, మైనార్టీ విభాగం నాయకులు చాంద్‌బాషా, సాధిక్, అమీర్‌బాషా, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు జింకా కంబగిరి, వైఎస్సార్ విద్యార్థి విభాగ్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, అమర్‌నాథ్‌రెడ్డి, రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి, చింతకాయల నరేష్, చింతా భాస్కర్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్‌లు బడన్నపల్లి కేశవరెడ్డి, రాయపాటి రామకృష్ణ, చిల్లా భాస్కర్‌రెడ్డి, కేగాళ్ల కృష్ణమూర్తి, కత్తెపెద్దన్న, ఎస్పీ బాషా, దేవరకొండ రమేష్, చౌడప్పతో పాటు వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలు తుంగలో తొక్కారు

తాడిమర్రి: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నేతలు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జొల్లిరెడ్డి అశ్వర్థ, బీసీ సెల్ ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షులు కుంటాల పుల్లయ్య ఎద్దేవా చేశారు. ధర్మవరంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ‘వెన్నుపోటు దినం’కు వారు మండల కార్యకర్తలతో కలసి తరలి వెళ్లారు. మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు, మండల యూత్ కన్వీనర్ సిద్దే మోహన్‌రెడ్డి, నాయకులు పిట్టు పరమేశ్వర్‌రెడ్డి, గుజ్జల హనుమంతు, అల్లే సాయినాథ్‌రెడ్డి, మదమంచి మల్లికార్జున నాయుడు, గద్దె రాజేష్‌రెడ్డి, జొల్లిరెడ్డి రామన్న, కొండారుపల్లి విశ్వనాథ్, ఎంపీటీసీ పూలకుంట చంద్రబాబు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: ధర్మవరంలో చేపట్టిన ‘వెన్నుపోటు దినం’ నిరసన కార్యక్రమానికి ముదిగుబ్బ మండలం నుంచి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఇందుకూరు నారాయణరెడ్డి, కన్వీనర్ సీవీ నారాయణరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.

బత్తలపల్లి: మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ‘వెన్నుపోటు దినం’ నిరసన కార్యక్రమానికి బత్తలపల్లి మండలం నుంచి పార్టీకి చెందిన సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ఎంపీటీసీ సభ్యులతో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ధర్మవరం తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్, నియోజకవర్గ కల్చరల్ ప్రెసిడెంట్ షరాబ్ యోగానంద ఆచారి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడుకు తరలిన నాయకులు..

చెన్నేకొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బుధవారం రాప్తాడులో జరిగిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి భారీగా తరలి వెళ్లారు. తొలుత న్యామద్దెల సర్కిల్ ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

వెన్నుపోటుకు చిరునామా చంద్రబాబు



పుట్టపర్తిలో నిరసనలో పాల్గొన్న దుద్దుకుంట, శంకరనారాయణ, గోరంట్ల మాధవ్ తదితరులు

పుట్టపర్తి: వెన్నుపోటుకు చిరునామా చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ నేతలు ధ్వజమెత్తారు. బుధవారం పుట్టపర్తిలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన వంచనకు నిరసనగా ‘వెన్నుపోటు దినం’ నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పార్టీ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడే బైఠాయించి కూటమి ప్రజా వ్యతిరేక పాలనను ఎండగట్టారు. ఈ సందర్భంగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు మాలగుండ్ల శంకరనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడారు. సొంత మామకే వెన్నుపోటు పొడిచి టీడీపీని, అధికార పగ్గాలను చేజిక్కించుకున్న చంద్రబాబుకు.. అబద్ధపు హామీలతో ప్రజలను వంచించడం పెద్ద విషయం కాదని ఎద్దేవా చేశారు. నాడు రైతు రుణ మాఫీ, డ్వాక్రా రుణాల మాఫీ.. నేడు సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను వంచించిన చంద్రబాబుకు పాలించే అర్హత లేదన్నారు. హామీలు అమలు చేయక పోగా.. వైఎస్సార్‌సీపీ నేతలపై కక్షపూరిత రాజకీయాలకు పాల్పడటం.. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపడం పరిపాటిగా మారిందన్నారు. అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

పుట్టపర్తికి బైక్ ర్యాలీ

కొత్తచెరువు: వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు కొత్తచెరువు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు 600 బైక్‌లతో ర్యాలీగా వెళ్లారు. మండల కన్వీనర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మహాలక్ష్మి సూరి, పుట్టపర్తి నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడు కొండారెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వడ్డే నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు పాదయాత్ర వాల్మీకి శంకర, వైఎస్సార్‌సీపీ నాయకులు యుగంధర్ రాయల్, గడ్డల రఫీ, ముద్దల భాస్కర్, డేరంగుల వెంకట రాముడు, ఎల్లప్ప, కేశవ, ఆవుల అశోక్, వడ్డే శ్రీనివాసులు, అజయ్, భార్గవరెడ్డి, చంద్రాయుడు, మాబ్బాషా, తిప్పారెడ్డి, గోపాల్ రెడ్డి, శోదనపల్లి రామాంజనేయులు, నరసింహ పాల్గొన్నారు.

నల్లమాడ: పుట్టపర్తిలో నిర్వహించిన వెన్నుపోటు దినం ర్యాలీకి నల్లమాడ మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో వెళ్లారు. మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొరకల రమణ, మండల మాజీ కన్వీనర్లు కె. సూర్యనారాయణ, పొరకల రామాంజినేయులు, కుళ్లాయినాయక్, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షులు దాదిరెడ్డి గంగిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు కె.రెడ్డెప్ప, సర్పంచ్‌లు ప్రసాద్, బొజ్జేనాయక్, లింగమూర్తి, నాగరాజునాయుడు, మూర్తి, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, గోపాల్‌నాయుడు, చంద్రశేఖర్, కమలాకర్‌నాయుడు, గంగాపురం రవి, ప్రతాప్ నాయక్, యర్ర సూరి, షంషీర్, బడా నాగార్జునరెడ్డి, జిరాక్స్ గోవిందరెడ్డి, రాజారెడ్డి, వెంకటశివారెడ్డి, పురుషోత్తంరెడ్డి, చెర్లో మాధవరెడ్డి, ఆర్‌పీ రెడ్డి, నారాయణస్వామి, జశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కదిరిలో కదం తొక్కిన జనం



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కదిరి టౌన్: కూటమి ప్రభుత్వ నయవంచన పాలనను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రం కదిరిలో జనం కదం తొక్కారు. పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి.. ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఈశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పూలశ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్, లీగల్‌సెల్ జోనల్ ఇంచార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ఏర్పడి ఏడాది అయినా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ఐదు కోట్ల మంది ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్నికలకు ముందు ‘బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ’ అని ఊదరగొట్టారని.. నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు ఇలాగేనా మోసం చేసేది అంటూ మండిపడ్డారు. ఇక కదిరి నియోజకవర్గంలో అరాచక పాలనతో చెలరేగిపోతున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎంఎల్‌సీ వెన్నపూస రవీంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి. ప్రణీత్‌రెడ్డి, ఎంపీపీ తోట అమర్‌నాథ్‌రెడ్డి, కౌన్సిలర్లు లింగాల కృపాకర్‌రెడ్డి, రామ్‌ప్రసాద్, వలి, మండల కన్వీనర్లు రవికుమార్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, ఫయాజ్, అశోక్‌కుమార్ రెడ్డి, రంగారెడ్డి, మణికంఠనాయక్, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, వైస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కదిరికి బైక్ ర్యాలీ

నల్లచెరువు: కదిరిలో బుధవారం చేపట్టిన ‘వెన్నుపోటు దినం’కు నల్లచెరువు మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలి వెళ్లారు. జై జగన్ నినాదాలతో బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు.



కొత్తచెరువు నుంచి పుట్టపర్తికి బైకులతో ర్యాలీ



తాడిమర్రి నుంచి ధర్మవరానికి బయల్దేరిన నేతలు



రాప్తాడుకు బయల్దేరిన చెన్నేకొత్తపల్లి నాయకులు



నల్లచెరువు నుంచి కదిరికి బైక్ ర్యాలీ



పుట్టపర్తికి వెళ్తున్న నల్లమాడ మండలనేతలు

రక్తపోటును అశ్రద్ధ చేస్తే ప్రాణాలకు ముప్పు



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

ధర్మవరం అర్బన్: రక్తపోటుపై అశ్రద్ధ వహిస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పద్మమణి తెలిపారు. స్థానిక కొత్తపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పద్మమణి, జిల్లా ఎపిడిమియాలజిస్టు బాలాజీనాయక్, వైద్యాధికారి ప్రియాంక మాస్ స్క్రీనింగ్ నిర్వహించారు. సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధుల సర్వేను పరిశీలించి ప్రజలకు సూచనలు అందించారు. బీపీ, షుగర్, క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

కదిరి అర్బన్: అరుణాచలంలో పౌర్ణమి సందర్భంగా ఈ నెల 11న గిరిప్రదక్షిణకు కదిరి ఆర్టీసీ డిపోనుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డీఎం మైనోద్దీన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బస్సు 11న ఉదయం 10.30 గంటలకు బస్టాండు నుంచి బయలుదేరుతుందని తెలిపారు. తొలుత గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని అనంతరం అరుణాచలం వెళ్తుందని వివరించారు. నల్లచెరువు, తనకల్లు, చిత్తూరు జిల్లా మొలకలచెరువు, అంగళ్లలో బోర్డింగ్ పాయింట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒకే గ్రామంలో 35 నుంచి 40 మంది భక్తులు ఉంటే వారి వారి గ్రామానికే నేరుగా బస్సు పంపిస్తామని పేర్కొన్నారు. బస్సు చార్జీ రూ.1,140 అని, ఆన్‌లైన్‌లోకూడా టికెట్ సదుపాయం ఉందని వెల్లడించారు. బస్సు సర్వీస్ నంబర్ 15303 అని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99592 25892లో సంప్రదించాలని సూచించారు.

పుట్టపర్తి టౌన్: అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఈ నెల 10న పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఉదయం 6.30 గంటలకు ప్రత్యేక సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఇనయతుల్లా తెలిపారు. గిరి ప్రదక్షిణతో పాటు వేలూరు గోల్డెన్ టెంపుల్, కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనం అదనంగా చూపించడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ ప్రత్యేక సర్వీసు పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఈ నెల 10న ఉదయం 6.30 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా, పుట్టపర్తి బస్టాండ్ నుంచి టికెట్లు రిజర్వేషన్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున అరుణాచలానికి బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు 73828 59729, 99592 25857, 94402 01570 నంబర్లలో సంప్రదించాలన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: యోగాంధ్ర కార్యక్రమాన్ని కలిసికట్టుగా విజయవంతం చేద్దామని ఆర్డీఓ మహేష్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ సమావేశ కార్యాలయంలో బుధవారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11న ధర్మవరంలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అధికారులు తమవంతు బాధ్యతలు నిర్వర్తించాలని తెలిపారు. యోగా అనేది మన జీవితంలో ప్రతిరోజు ఒక భాగంగా చేసుకుంటే అందరూ ఆరోగ్యంగా జీవించడానికి దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ శివకుమారి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య, మున్సిపల్ ఇంజినీర్ సాయికృష్ణ, ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లోని ఎంపీడీఓలు, ఎంఈఓలు, సీడీపీఓలు, డీడబ్ల్యూఎంఏ, డీఆర్‌డీఏ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

చెన్నేకొత్తపల్లి: నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి. యోగాతో మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంతత పెరుగుతుందని ఎంపీడీఓ బాలక్రిష్ణుడు అన్నారు. యోగాంధ్రలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం యోగాపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్య సమస్యలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రత్నకుమారి, మాస్టర్ ట్రైనర్లు మహేష్, షకీలా తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువు.. సాగు బాగు

బత్తలపల్లి: రైతులు అధిక పంట దిగుబడుల కోసం రకరకాల రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. అయితే రానురాను భూసారం తగ్గి పంట దిగుబడి తగ్గే ప్రమాదం లేకపోలేదు. ఈ సమస్య నుంచి బయట పడేందుకు సేంద్రియ ఎరువుల వైపు రైతులు దృష్టి సారించాలని అధికారులు సూచిస్తున్నారు. సేంద్రియ ఎరువైన పశువుల పేడను వినియోగించడం వల్ల పంటలకు ఎంతో ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు. ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలకు చెందిన రైతులు ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలి. పశువుల ఎరువు, వర్మీకంపోస్టు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్ల ఎరువును సేంద్రియ ఎరువుగా చేసుకోవచ్చు. సేంద్రియ ఎరువుల్లో ఉన్న పోషకాల శాతాన్ని తెలుసుకుని తగిన మోతాదులో దశల వారీగా వేస్తూ పంటలు పండిస్తే రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. దిగుబడులు సైతం పెరుగుతాయి. భూసారం అభివృద్ధి చెందుతుంది. ఎకరాకు నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్ల పశువుల పేడ అవసరమవుతుంది. రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చేలా సేంద్రియ ఎరువు దోహదం చేస్తుంది. దీంతో రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. పంటల సాగుకు ఖర్చు కూడా తక్కువ అవుతుంది.